క్లుప్తంగా

క్యారెమ్స్ విజేతలకు బహుమతులు



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం క్యారమ్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ వై.మహేష్ మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. క్యారెమ్స్ పోటీలో పతివాడ దిలీప్, కోరాడ మహీధర్ విజేతలుగా నిలిచారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి



పూజలు చేస్తున్న అర్చకుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో కొలువుదీరిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల పంచామృత ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం నూతన వస్త్రాలు, పూలతో స్వామినిన అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మురుగునీటితో ఇక్కట్లు



దేవుని నెలివాడ వద్ద ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగు నీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక దేవుని నెలివాడ వద్ద నిలిచిన మురుగునీటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలిపే రహదారి కావడంతో నిత్యం ఈ రహదారిలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. కొన్ని సంవత్సరాల నుంచి కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో మురుగు నీరు ప్రధాన రహదారిపై నిల్వ ఉంటోంది. దీంతో స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహ స్వామి జయంతి

సీతానగరం: సువర్ణముఖీనదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు సీహెచ్ గోపాలకృష్ణ కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం వైభవంగా సాగాయి. అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. లోక కల్యాణార్థం ఏటా స్వామివారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాగ పూజలు, అభిషేకాల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సాలూరు: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సాలూరు పట్టణ సీఐ వాసునాయుడు హెచ్చరించారు. పట్టణంలోని అక్కేనవీధి రామమందిరం వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 4వ తేదీ వరకు పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సోషల్ మీడియా, బయట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో ఏ విధమైన ర్యాలీలు, ఊరేగింపులకు అనమతి లేదన్నారు.

శాంతియుత జీవనం శ్రేయస్కరం

- ఓట్లు లెక్కింపు వరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు

సీతానగరం: గ్రామీణ ప్రజలు శాంతియుతంగా మెలగాలని, ఓట్లు లెక్కింపు వరకు మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపారు. పెదంకలాం, సుమిత్రాపురం గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిందని, వాటికోసం వాగ్వాదాలు, గొడవలు పడి కుటుంబాల ఐక్యతను దెబ్బతీసుకోవద్దన్నారు. స్నేహపూర్వంగా మెలగాలని సూచించారు. వివాదాస్పద వ్యక్తులపై నిఘా ఉంచామని, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇనాం భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం..

- పదేళ్లుగా ఎమ్మెల్యే కళావతి చేసిన కృషికి దక్కిన ఫలితం
- 1300 ఎకరాలకు హక్కుదారులు కానున్న 350 మంది రైతులు
- జగనన్న భూహక్కు- భూరక్ష పథకంతో సత్ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



వండువ రెవెన్యూ పరిధిలోని రైతులు (ఫైల్)

వీరఘట్టం: వందేళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్ల పరిష్కారం లభించింది. జగనన్న భూహక్కు – భూరక్ష చట్టంతో శాశ్వత పరిష్కారం లభించడంతో వండవ గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వండవ గ్రామ రెవెన్యూ పరిధిలో గల భూములు వందేళ్లుగా రైతుల సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా సాగు చేసుకుంటూ ఫలసాయం అనుభవిస్తున్నారు. అయినప్పటికీ ఏ ఒక్క రైతుకు కూడా తాము సాగు చేస్తున్న భూములపై ఇంతవరకు హక్కు పత్రాలు లేవు. ఎందుకంటే ఈ భూములన్నీ ఇనాం భూములుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉండడంతో ఈ భూములు అమ్మేందుకు గాని, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గాని వీలుకాని పరిస్థితి. దీంతో వండవ గ్రామ రైతులంతా రైతు, వ్యవసాయ, బ్యాంక్ రుణాలకు దూరమయ్యారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన జగనన్న భూ హక్కు – భూరక్ష పథకంతో రైతులందరికీ మేలు చేకూరింది. వండవ రెవెన్యూ పరిధిలో ఇటీవల జరిగిన రీ సర్వేతో రైతులంతా భూ హక్కుదారులు కానున్నారు. ఇందుకోసం పదేళ్లుగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విశేష కృషి చేశారు.

ఇదీ పరిస్థితి....

వీరఘట్టం మండలం వండవ రెవెన్యూ పరిధిలో 1450 ఎకరాల భూములున్నాయి. వీటిలో 150 ఎకరాలు చెరువులు, రోడ్లు, శ్మశానవాటికలు కాగా మిగిలిన 1300 ఎకరాలు రైతులకు చెందిన భూములు. వండవ రెవెన్యూ పరిధిలో వండవ గ్రామ రైతులతో పాటు పాపంపేట, బొడ్లపాడు, తెట్టంగి, శృంగరాయపురం, పాలకొండ మండలం అవలంగి గ్రామాలకు చెందిన 350 మంది రైతుల భూములు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఇనాం భూములు కావడంతో భూముల క్రయ, విక్రయాలు జరగడం లేదు. దీంతో ఒక్క ప్రభుత్వ పథకాన్ని కూడా ఇక్కడి రైతులు పొందలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ప్రభుత్వం సహకారంతో భూముల సమస్య తీరడంతో ఎమ్మెల్యే కళావతికి రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నెల రోజుల్లో పట్టాదారు పాసు పుస్తకాలు..



బ్రిటిష్ కాలంలో భూములను ఇనాం, ఎస్టేట్ అనే రెండు రకాలుగా విభజించారు. రైతుల వద్ద ఉన్న భూములకు బ్రిటిష్ వారు శిస్తు కట్టించుకునే వారు.ఆ భూములను ఎస్టేట్ భూములని.. ఒకే వ్యక్తి దగ్గర వేల ఎకరాలుంటే వాటికి కూడా శిస్తు కట్టించుకుని ఇనాం భూములుగా పేర్కొన్నారు. మా వంశానికి చెందిన వండవ దొరమాసీ ఆధ్వర్యంలో మా గ్రామం ఉండడంతో ఈ భూములన్నీ ఇనాంగా రికార్డుల్లో నమోదయ్యాయి. మా వంశీసస్తులు కాలక్రమేణా ఈ భూములను రైతులకు ఇచ్చినప్పటికీ రికార్డుల్లో మాత్రం ఎటువంటి మార్పు జరగకపోవడంతో నేటికీ ఇనాం భూములుగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలో జగనన్న భూరక్ష – భూహక్కు పథకం తీసుకురావడంతో భూముల రీ సర్వే జరిగింది. మరో నెల రోజుల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వస్తాయి.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, వండవ

ఏళ్ల తరబడి తిరిగాం..



భూములన్నీ మా సాగులో ఉన్నప్పటికీ హక్కుపత్రాలు మాత్రం ఎవ్వరికీ లేవు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే కళావతి చొరవతో 'జగనన్న భూరక్ష – భూహక్కు' ద్వారా పరిష్కారం లభించింది. త్వరలోనే రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వస్తాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మేలు ఎన్నటికీ మరువలేం.

– కందల వెంకటనాయుడు, రైతు, వండవ

రుణాలు పొందలేదు..



భూములు మా సొంతమే అయినప్పటికీ హక్కుపత్రాలు లేకపోవడంతో ఇంతవరకు ఒక్కసారి కూడా వ్యవసాయ రుణం పొందలేకపోయాం. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి దయవల్ల అధికారులు కొద్ది రోజుల కిందట రీ సర్వే చేశారు. మరికొద్ది రోజుల్లో మా భూములు మాకు అప్పగించి, పాసు పుస్తకాలు ఇస్తామని అధికారులు చెబుతుండడం ఎంతో ఆనందంగా ఉంది.

– సింగిశెట్టి శ్రీనివాసరావు, రైతు, వండవ

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాల స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన ఉపాలయంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు స్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాల స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపించి, స్వామి సన్నిధిలో సదస్యం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రామపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం జరిపిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, పవన్, రామగోపాల్ పాల్గొన్నారు.

సమయ పాలన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాను

సీతానగరం: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులు సమయపాలన పాటించాలని, సామాజిక పరమైన పనులకు ప్రాధాన్యమివ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ కృష్ణ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులు, వేతనం గిట్టుబాటు, వేతనదారుల హాజరు తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ మండల వ్యాప్తంగా 11,872 నుంచి 13,234 మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారని, వీరందరూ సమయ పాలన పాటించేలా చూడాలన్నారు. కొలతల ఆధారంగా పనిచేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- ఏడీఏ మధుసూదనరావు



పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏడీఏ మధుసూదనరావు

పాచిపెంట: పచ్చిరొట్ట ఎరువుతో నేల మరింత సారవంతమవుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు అన్నారు. పాచిపెంట మండలంలోని కోష్టువలస, మంచాడవలస గ్రామాల రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. పచ్చిరొట్ట ఎరువుతో భూమికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని, పంట దిగుబడికి దోహదపడతాయని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను జల్లి పూతదశలో కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు, వీఏఏ వినోద్‌కుమార్, మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సీతంపేట: హైరిస్క్ మలేరియా గ్రామాల్లో దోమల నివారణ మందును విస్తృతంగా పిచికారీ చేయాలని మలేరియా నివారణ శాఖ సబ్‌యూనిట్ ఆఫీసర్ జె. మోహనరావు అన్నారు. మండలంలోని దుగ్గి, కొత్తవలస, పెద్దపొల్ల గ్రామాల్లో ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయడాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

పాలకొండ: మండలంలో ఎవరైనా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వరహాలు హెచ్చరించారు. మండలంలోని మంగళాపురం, గోపాలపురం గ్రామాల్లోని నాగావళి నదీ తీరప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాపై వీఆర్‌ఓలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముగిసిన గ్రామదేవత సంబరాలు

భామిని: మండలంలోని గజపతినగరం గ్రామంలో గ్రామదేవత సంబరాలు బుధవారంతో ముగిశాయి. ఐదు రోజులుగా సంప్రదాయబద్ధంగా గ్రామదేవత ఘటాలు, పాలజంగిడిలకు పూజలు నిర్వహించారు. బంధువులతో ప్రతి ఇల్లూ కళకళలాడింది.

అందుబాటులో పుస్తకాలు

భామిని: వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉన్నాయని గ్రంథాలయాధికారి ఎ. సునీత తెలిపారు. ఈ మేరకు కాంపిటేటివ్ బుక్స్, ఇతర పరీక్షల మెటీరియల్ వివరాలను వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

భవిత కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి



ప్రచారం చేస్తున్న ఎంఈఓ, తదితరులు

- ఎంఈఓ విజయకుమార్, ఐఈ సమన్వయకర్త సూర్యారావు

నెల్లిమర్ల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓ ఈపు విజయకుమార్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎస్. సూర్యారావు పిలుపునిచ్చారు. భవిత కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ నెల్లిమర్ల పట్టణంలో బుధవారం క్యాంపెయిన్ నిర్వహించారు. తల్లిదండ్రులను కలిసి దివ్యాంగులైన పిల్లల కోసం ప్రభుత్వం నడుపుతున్న భవిత కేంద్రాల గురించి వివరించారు. విద్యా బోధనతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే పిల్లలకు అవసరమైన పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సహిత విద్య సహాయ సమన్వయకర్త భారతి, ఉపాధ్యాయులు బెల్లాన అప్పలనాయుడు, పురుషోత్తంనాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు



మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

నెల్లిమర్ల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంఘ నెల్లిమర్ల తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘ శాఖా అధ్యక్షుడు పి. వీరన్నదొర అధ్యక్షతన జరిగిన సమావేశానికి రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే అపరిష్కృతంగా మిగిలి ఉన్న సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి చర్యరలు తీసుకుంటామని చెప్పారు. ఉద్యోగులు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోలగలమన్నారు. నెల్లిమర్ల తాలూకా కమిటీ అధ్యక్షుడు వీరన్నదొర మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పట్ల జిల్లా నాయకత్వం చురుగ్గా స్పందించడం అభినందనీయమన్నారు. నెల్లిమర్ల తాలూకా యూనిట్‌ను కార్యవర్గ సభ్యుల సహకారంతో మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశానికి సంఘ ప్రతినిధులు కంది వెంకటరమణ, చింతల వెంకటేష్, టి. శివప్రసాద్, డాక్టర్ చక్రవర్తి, ఎం. మురళీ, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన మామిడి దిగుబడి

- నష్టాల్లో మామిడి రైతాంగం
- అనుకూలించని వాతావరణం
- పంటను దెబ్బతీసిన చీడపీడలు
- జిల్లాలో 30,719 హెక్టార్లలో మామిడి సాగు
- 1,500 నుంచి 150 టన్నులకు పడిపోయిన ఎగుమతులు

ఎస్.కోట నియోజకవర్గంలో మామిడి తోటల సాగు విస్తీర్ణం వివరాలు

మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో)
వేపాడ	422
లక్కవరపుకోట	922
కొత్తవలస	1,495
శృంగవరపుకోట	251
జామి	1,336



వేపాడలో కాపులేని మామిడి తోట



వేపాడలో ఒక్క కాయకూడా లేని లేత మామిడి చెట్టు

శృంగవరపుకోట: జిల్లాలో మామిడి సాగు చేసే రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ఈ ఏడాది లాభాల మాట పక్కన పెడితే పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అను కూలించని వాతావరణం, పంటను ఆశించిన చీడపీడలు, అకాల వర్షాలు మామిడి రైతాంగాన్ని ఉసూరు మనిపించాయి. దేశీయ అవసరాలతో పాటు, విదేశాలకు ఎగుమతికి అవకాశం ఉన్న పంటగా మామిడికి మంచి స్థానం ఉంది. ఏటా కచ్చితమైన ఆదాయం అందుతుందన్న ధీమాతో నీటి అవకాశం లేని మెట్ట భూముల్లో రైతులు మామిడి తోటల పెంపకం కొనసాగిస్తూ వస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం ఉద్యానతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు, రాయితీలు ఇవ్వడంతో వాణిజ్యపంటగా మామిడిని రైతులు ఎంచుకుంటున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలను తెచ్చి తోటలపెంపకం చేపట్టారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచాలన్న లక్ష్యంతో గ్రాఫ్టింగ్ పద్ధతి ఎంచుకుంటున్నారు. కాగా పెట్టుబడి ఖర్చులు పెరగడం తప్ప ఆదాయం లేకపోవటంతో జిల్లాలో మామిడి సాగు క్రమంగా తగ్గుతోంది. ముదర మామిడి తోటలు తీసేసి వాటిస్థానే ప్రత్యామ్నాయ తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలేనే మామిడి పంటను చీడపీడలు ఆశించా యి. తేనేమంచు పురుగు, పండుఈగ, కాయ తొలుచు పురుగులు పంటను దెబ్బతీశాయి. పూత దశలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో మొగ్గలు విచ్చుకోక, పూత ఆలస్యం కావడం,పిందె కట్టేందుకు ఎక్కువ సమయం తీసుకుంది. తర్వాత జనవరిలో కురిసిన అకాల వర్షాలు పంటకు ప్రతికూలంగా మారాయి. పూత, పిందె దశలో వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.

నానాటికీ తీసికట్టుగా..

నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్న సామెత తీరుగా వరుసగా మామిడి దిగుబడులు రైతులను కుంగదీస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో మామిడి దిగుబడులు 20 నుంచి 25శాతం వరకే ఉన్నట్టు ఉద్యానవన శాఖ గణాంకాలే చెబుతున్నాయి. కాగా ఈ ఏడాది ఈ దిగుబడులు ఇంకా తగ్గాయి. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో 10శాతం, మరికొన్ని ప్రాంతాల్లో 15శాతం దిగుబడులు ఉన్నట్టు ఉద్యానవన శాఖాధికా రులు చెబుతున్నారు. గతంలో జిల్లా నుంచి 1,500 టన్నుల మామిడి పండ్లు ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. నేడు జిల్లా నుంచి 150 టన్నులు ఎగుమతి ఎంతో కష్టంగా ఉన్నట్టు జిల్లా మామిడి రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు దేముడు చెబుతున్నారు.

ముంచేసిన మామిడి

గతంలో రూ.లక్ష విలువ చేసే తోటకు రూ.10వేలు పెట్టుబడులు సరిపోయేవి. కాగా నేడు రూ.లక్ష విలువ చేసే తోటకు రూ.లక్ష పెట్టుబడి అవుతోంది. చీడపీడలు, తగ్గిన దిగుబడులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మామిడిపై ఆధారపడ్డ రైతులు, వ్యాపారులను దివాళా తీయించే సింది. గతంలో తోటలపై అడ్వాన్సులు ఇచ్చేవారు. దిగుబడులు లేక, రైతులు పంట ఇవ్వకుంటే వ్యాపారులు లక్షల రూపాయ ల్లో నష్టాలు చూస్తున్నారు. ఉత్తరాదికి మామిడి ఎగుమతి చేసే మధ్యవర్తులు లక్షల్లో పెట్టుబడి పెట్టి, స్టాక్‌పాయింట్లు, ప్యాకింగ్, లేబర్, ట్రాన్స్‌పోర్టు అన్నీ సిద్ధం చేసుకున్నాక పంపేందుకు సరుకు లేక నష్టపోతున్నారు.

వాతావరణ పరిస్థితులే కారణం



చీడపీడలు, వాతావరణంలో అకాల మార్పులు ఈ ఏడాది మామిడి పంటకు శాపంగా పరిణమించాయి. పూత, పిందె దశలో తీవ్రమైన ఎండ, మంచు పంటను దెబ్బతీశాయి. పురుగుకు వాతావరణం అనుకూలించడంతో తేనేమంచు, కాయతొలుచు, పండు ఈగ వంటివి ప్రారంభంలోనే కోలుకోలేకుండా దెబ్బతీశాయి. ఈ ఏడాది దిగుబడులు 15 శాతంకు మించలేదు.

– పి.పద్మ, కొత్తవలస మండల ఉద్యానశాఖాధికారి.

తోటలు తీసేస్తున్నారు..



ఇవే పరిస్థితులు కొనసాగితే మామిడి పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడం ఖాయం . ఇప్పటికే నష్టాలు భరించలేక రైతులు తోటలు తీసేస్తున్నారు. ఉద్యాన శాఖ తక్షణం మామిడి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి, క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రయోగాలు జరగాలి. రైతులకు సస్యరక్షణ చర్యలపై అధికారులు మరింత అవగాహన పెంచాలి. కొత్త రకాలు, పాత తోటల పునరుద్ధరణ, వాతావరణం తట్టుకునే చర్యలపై ఒక ప్లానింగ్ అవసరం . ఈ ఏడాది వాతావరణం భిన్నంగా ఉంది. ఒకే రోజులో తీవ్ర మైన ఎండ, రాత్రి వేళ చలి ఉండడంతో పంటను చీడపీడలు దెబ్బతీశాయి.

– లగుడు దేముడు, జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com